క్లుప్తంగా

వసతి గృహాల్లో జిల్లా జడ్జి తనిఖీ



విద్యార్థులతో మాట్లాడుతున్న జిల్లా జడ్జి కబర్థి

కల్లూరు: జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా జడ్జి జి.కబర్థి, కార్యదర్శి బి.లీలా వెంకట శేషాద్రి సోమవారం పెద్దపాడులోని ఎస్సీ వసతి గృహం, దామోదరం సంజీవయ్య బాల సదన్ హాస్టల్‌ను తనిఖీ చేశారు. హాస్టళ్లలో కల్పిస్తున్న సౌకర్యాలపై ఆరా తీశారు. వసతి గృహాల్లో ఆహారం నాణ్యత, పరిశుభ్రతను పరిశీలించి విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రిజిస్టర్లు, రికార్డులను పరిశీలించారు. సమస్యలు ఉంటే తమకు తెలియజేయాలని, సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.

తప్పిన ప్రమాదం



దెబ్బతిన్న బస్సు

పాణ్యం: మండల పరిధిలోని సుగాలిమెట్ట వద్ద రెండు బస్సులు ఢీకొన్నాయి. హైవే పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. కడప డిపోకు చెందిన బస్సుకు ముందు వెళ్తున్న కారు అకస్మాత్తుగా అడ్డు రావడంతో సడన్ బ్రేక్ వేయగా వెనక వస్తున్న నంద్యాల డిపోకు చెందిన బస్సు ఢీకొట్టింది. ఈ ఘటనలో ఎవరికీ గాయాలు కాలేదు. ప్రమాదంలో బస్సు అద్దాలు పగిలిపోయాయి. బస్సులు ఢీకొనడంతో ప్రయాణికులు భయాందోళనకు గురయ్యారు. హైవే మరమ్మతుల నేపథ్యంలో వాహనాలు వన్‌వేలో వెళ్తున్నాయి. విషయం తెలుసుకున్న హైవే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని ట్రాఫిక్ సమస్య పరిష్కరించారు.

మద్యం సేవించి వాహనం నడిపితే జైలుకే..

కోడుమూరు రూరల్: మద్యం సేవించి వాహనాలు నడిపితే చట్టప్రకారం చర్యలు తీసుకుని జైలుకు పంపుతామని కోడుమూరు ఎస్‌ఐ శ్రీనివాసులు హెచ్చరించారు. సోమవారం రాత్రి కోడుమూరు నుంచి కర్నూలు వెళ్లే రోడ్డులో ఎస్‌ఐ శ్రీనివాసులు తన సిబ్బందితో వాహనాల తనిఖీ, డ్రంకన్ డ్రైవ్ టెస్ట్‌లను నిర్వహించారు. మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న ముగ్గురిపై కేసులు నమోదు చేయడంతో పాటు, సరైన పత్రాలు లేని వాహనదారులకు జరిమానా విధించారు. ఎస్‌ఐ మాట్లాడుతూ.. వాహనదారులంతా రోడ్డు నిబంధనలు తూచ తప్పక పాటించాలన్నారు.

రాత్రి వేళ గస్తీ పెంచండి

కర్నూలు (టౌన్): రాత్రి వేళ గస్తీ పెంచండి. డ్రంకన్ డ్రైవ్, ఓపెన్ డ్రింకింగ్ తనిఖీలు నిర్వహించాలని జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆదేశించారు. సోమవారం సాయంత్రం జిల్లా ఎస్పీ నాలుగవ పట్టణ పోలీసు స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. సిబ్బంది పనితీరును, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. స్టేషన్‌లో రికార్డులను పరిశీలించారు. తగిన సూచనలు సలహాలు చేశారు. పోలీసు స్టేషన్ పరిసరాలను పరిశీలించారు. ఎస్పీ మాట్లాడుతూ.. నేరాలు జరగకుండా అప్రమత్తంగా విధులు నిర్వహించాలన్నారు. 'నేను సైబర్ స్మార్ట్' పేరుతో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. వివిధ కేసుల్లో పట్టుబడిన వాహనాలను క్లియర్ చేయాలన్నారు. నాలుగవ పట్టణ సీఐ మధుసూదన్ గౌడ్, ఎస్‌ఐలు షమీర్ బాషా, చంద్రశేఖర్, గోపీనాథ్ పాల్గొన్నారు.

భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలి

పాణ్యం: అత్యంత గొప్ప చరిత్ర కలిగిన మహిమాన్వితుడు పాణికేశ్వరస్వామి దేవాలయానికి వచ్చే భక్తులకు సౌకర్యాలు కల్పించాలని ప్రజాసంఘాల నాయకులు సోమవారం తహసీల్దార్ నరేంద్రనాథ్ రెడ్డికి పీజీఆర్ఎస్‌లో వినతి పత్రం అందించారు. వారు మాట్లాడుతూ.. ఆలయానికి మహాశివరాత్రి రోజున చుట్టుపక్కల గ్రామాల నుంచి వేలాదిగా భక్తు లు తరలి వస్తారన్నారు. మహిళలకు దుస్తులు మార్చుకునేందుకు గదులు, మరుగుదొడ్లు, మంచినీరు తదితర సౌకర్యాలు కల్పించాలని కోరారు. ఏటా తూతూమంత్రంగా అరకొర వసతులు కల్పిస్తున్నారన్నారు. దీంతో భక్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు చెప్పారు. ఎస్ఎఫ్ఐ నంద్యాల కార్యదర్శి ప్రతాప్, ఏఐఎఫ్‌బీ నాయకులు వెంకటాద్రి, శ్రీనివాసులు, సీఐటీయూ నాయకు లు నాగరాజు, దేవరాజు తదితరులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

సి.బెళగల్: మండలంలోని తుంగభద్ర నది నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ఆరు ట్రాక్టర్లను పోలీసులు పట్టుకున్నారు. సోమవారం ఉదయం ఎస్‌ఐ తిమ్మారెడ్డి సిబ్బందితో గ్రామాల్లో గస్తీ నిర్వహిస్తుండగా తుంగభద్ర నదీతీర గ్రామమైన గుండ్రేవుల నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న తెలంగాణ ప్రాంతానికి చెందిన మూడు ట్రాక్టర్లు కనిపించడంతో వాటిని పట్టుకొని సీజ్ చేశారు.అక్రమార్కులపై కేసు నమోదు చేసి ట్రాక్టర్లను రెవెన్యూ అధికారులకు అప్పగిస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఇళ్ల స్థలాలు ఇవ్వాలి



దరఖాస్తులు ఇస్తున్న ప్రజలు

కల్లూరు: అర్హులైన పేదలందరికీ ఇళ్ల స్థలాలు ఇచ్చి, పక్కా గృహాలు నిర్మించాలని సీపీఎం న్యూసిటీ నగర కార్యదర్శి వర్గ సభ్యులు ప్రభాకర్, గోపినాథ్ డిమాండ్ చేశారు. సోమవారం కల్లూరు అర్బన్ 36వ వార్డు పెద్దపాడులో సచివాలయం వద్ద సీపీఎం నాయకులు, ప్రజలు ఆందోళన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం నాయకులు మాట్లాడుతూ.. సీఎం చంద్రబాబు ఇచ్చిన హామీ ప్రకారం పట్టణ ప్రాంతాల్లో రెండు సెంట్లు, గ్రామీణ ప్రాంతాల్లో మూడు సెంట్లు స్థలం ఇచ్చి ఇళ్లు నిర్మించాలన్నారు. కూటమి నేతలు అనేక వాగ్దానాలతో ప్రజలను మభ్యపెట్టి సూపర్ సిక్స్ పథకాలు అమలు చేస్తామని చెప్పి తీరా అధికారంలోకి వచ్చి 9 నెలలు అవుతున్నా ఒక్కటీ నెరవేర్చలేదన్నారు. అనంతరం పెద్దపాడులో ఇల్లు లేని ప్రజలందరూ సచివాలయం అధికారులకు దరఖాస్తులను అందించారు. నాయకులు శ్రీను, యేసు, రాజు, వరలక్ష్మి, కృష్ణ, రమేష్, రాము, చిన్న, నారాయణ, జానకమ్మ తదితరులు పాల్గొన్నారు.

గిట్టుబాటు ధర కల్పించాలి



ధర్నా చేస్తున్న రైతు సంఘం నాయకులు

కర్నూలు(రూరల్): రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించి ఆదుకోవాలని ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి.రామకృష్ణ కోరారు. సోమవారం కర్నూలు ఆర్డీఓ కార్యాలయం వద్ద సీపీఎం ఆధ్వర్యంలో రైతు సంఘం నాయకులు ధర్నా నిర్వహించారు. వారు మాట్లడుతూ.. ఈ ఏడాది వర్షభావ పరిస్థితుల వల్ల దిగుబడులు అంతంత మాత్రమే వచ్చాయన్నారు. ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పించకుండా రైతులను మోసగించిందని ఆవేదన వ్యక్తం చేశారు. పంట దిగుబడులకు మద్దతు ధర కల్పించి ప్రభుత్వమే కొనుగోలు చేయాలని, గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని కోరారు. అలాగే రెవెన్యూ సదస్సులో వచ్చిన ప్రతి అర్జీని అధికారులు త్వరితగతిన పరిష్కరించాలన్నారు. ఆరులైన్ల రోడ్డులో భూములు కోల్పోయిన రైతులకు న్యాయం చేయకపోతే పెద్దఎత్తున ఆందోళనలు చేపడతామని స్పష్టం చేశారు. నాయకులు నాగన్న, ఆంజనేయులు, బాలపీర, వెంకటేశ్వర్లు, రఘువేంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఔట్ సోర్సింగ్‌లోనే కొనసాగించాలి



మాట్లాడుతున్న నెనావత్ రామునాయక్

ఓర్వకల్లు: గృహ నిర్మాణ శాఖలో పనిచేస్తున్న సిబ్బందిని ఔట్ సోర్సింగ్ పద్ధతిలోనే కొనసాగించాలని ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు నెనావత్ రామునాయక్ డిమాండ్ చేశారు. సోమవారం హౌసింగ్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో గత 20 ఏళ్లుగా 2500 మంది ఔట్ సోర్సింగ్ పద్ధతిలోనే పనిచేస్తున్నట్లు తెలిపారు. గత ప్రభుత్వం తమ కష్టాలను గుర్తించి ఏజెన్సీ వ్యవస్థను రద్దు చేసి, ఔట్ సోర్సింగ్ వ్యవస్థను (ఆప్కోస్) తీసుకురావడం జరిగింద న్నారు. ఈ వ్యవస్థ ద్వారా ప్రతి నెలా 1వ తేదీన జీతా లు అందుతున్నాయని తెలిపారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఔట్ సోర్సింగ్ వ్యవస్థను రద్దు చేసి,వాటి స్థానంలో ఏజెన్సీ వ్యవస్థను తీసుకురావాలని చూస్తోందన్నారు. ఈ వ్యవస్థ ద్వారా సిబ్బందికి జీతాలు సరిగా అందవని, సిబ్బందిని పని నుంచి తొలగించే అవకాశాలు ఉన్నాయన్నారు. ప్రభుత్వ ఆలోచనను విరమించుకోవాలని కోరారు. వర్క్ ఇన్‌స్పెక్టర్లు సత్యన్న, సుగుణమ్మ, డీటీపీ రమేష్ పాల్గొన్నారు.

కనీస వేతనాలివ్వాలి



నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

కోడుమూరు రూరల్: అంగన్‌వాడీ వర్కర్లకు కనీస వేతన చట్టం ప్రకారం రూ.26 వేలు వేతనం ఇవ్వాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాధాకృష్ణ డిమాండ్ చేశారు. సోమవారం కోడుమూరు ఐసీడీఎస్ కార్యాలయం వద్ద అంగన్‌వాడీ వర్కర్లు సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రాధాకృష్ణ మాట్లాడుతూ.. అంగన్‌వాడీ వర్కర్లకు వేతనాలను పెంచకపోవడంతో తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వాపోయారు. యాప్‌ల పేరుతో అంగన్‌వాడీలపై తీవ్ర పనిభారం మోపుతున్నారని, పిల్లల ఆధార్ కార్డుల పనిభారాన్ని కూడా వారిపైనే మోపడం ప్రభుత్వానికి సబబు కాదన్నారు. అంగన్‌వాడీ సెంటర్లకు వంట గ్యాస్‌ను ఉచితంగా సరఫరా చేయడంతో పాటు, వేతనంతో కూడిన మెడికల్ లీవ్ ఇవ్వాలని, మెనూ చార్జీలను పెంచాలని, అర్హులైన వారికి టీచర్లుగా ప్రమోషన్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సీఐటీయూ కార్యదర్శులు వీరన్న, మోహన్, అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ నాయకురాళ్లు తదితరులు పాల్గొన్నారు.

బాధితుడికి పరామర్శ



శ్రీరాములును పరామర్శిస్తున్న డాక్టర్ ఆదిమూలపు సతీష్

సి.బెళగల్: మండలంలోని బురాన్‌దొడ్డి గ్రామంలో కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న శ్రీరాములును వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ ఆదిమూలపు సతీష్ పరామర్శించి ధైర్యం చెప్పారు. గ్రామానికి చెందిన శ్రీరాములు కిడ్నీ సమస్యతో బాధపడుతూ, కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. విషయాన్ని మండల వైఎస్సార్‌సీపీ నాయకుల ద్వారా తెలుసుకున్న డాక్టర్ సతీష్ సోమవారం ఆసుపత్రికి చేరుకుని బాధితుడి ఆరోగ్య పరిస్థితిపై కుటుంబ సభ్యులను, డాక్టర్లను ఆరా తీశారు. బాధితుడి కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. అక్కడి వైద్యులతో మాట్లాడి శ్రీరాములుకు మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. వైఎస్సార్‌సీపీ మండల నాయకులు ఉన్నారు.

క్లోరినేషన్ చేసిన నీటినే సరఫరా చేయాలి



బావిలోని నీటిని పరిశీలిస్తున్న సర్పంచ్ పాండురంగన్న

సి.బెళగల్: గ్రామాలలో క్లోరినేషన్ చేసిన తర్వాతే నీటిని కుళాయిలకు సరఫరా చేయాలని ఈఓఆర్డీ ఈశ్వరయ్య స్వామి ఆదేశించారు. ఆయన సోమవారం సి.బెళగల్‌లోని మంచినీటి వనరులను సర్పంచ్ పాండురంగన్నతో కలిసి పరిశీలించారు. నీటిలో బ్లీచింగ్ పౌడర్ కలిపి క్లోరినేషన్ చేయించారు. గ్రామంలోని మంచినీటి ట్యాంకుతో పాటు, కృష్ణదొడ్డి రోడ్డులో ఉన్న మంచినీటి బావిలో క్లోరినేషన్‌లో బ్లీచింగ్ పౌడర్ చల్లించారు. ఈ పనులను ఈఓఆర్డీ పర్యవేక్షించి, సర్పంచ్, పారిశుద్ధ్య కూలీలకు పలు సూచనలు చేశారు. సర్పంచ్ గ్రామంలోని పారిశుద్ధ్య కూలీలతో ప్రధాన వీధులను శుభ్రం చేయించి, మురికి కాలువలలో పూడికను తీయించారు. గ్రామంలోని చెత్తను ట్రాక్టర్ ద్వారా ఊరి చివరకు తరలించారు.

దివ్యాంగులకు ఫిజియోథెరపీ సేవలు



ఫిజియోథెరపీ చేస్తున్న వైద్యుడు వీరేష్

సి.బెళగల్: స్థానిక భవితా కేంద్రంలో 12 మంది దివ్యాంగులకు ఫిజియోథెరపీ నిర్వహించినట్లు డాక్టర్ వీరేష్ తెలిపారు. క్యాంప్ నిర్వహణ సందర్భంగా వీరేష్ మాట్లాడుతూ.. మండలంలోని పలు గ్రామాల నుంచి వచ్చిన దివ్యాంగులకు బాల్, పాడ్స్ తదితర పరికరాలపై ముడుచుకపోయిన కాళ్లు, చేతులకు ప్రతి సోమవారం వ్యాయామం చేయించడం జరుగుతుందన్నారు. క్యాంప్‌లో తాము చేయించిన వ్యాయామాలను కుటుంబ సభ్యులు ఇంటి వద్ద సాధన చేయించాలన్నారు. ప్రతివారం ఉచితంగా నిర్వహించే ఫిజియోథెరపీ క్యాంప్‌ను మండల ప్రజలు, దివ్యాంగులు సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ సూచించారు. అదేవిధంగా ప్రత్యేక అవసరాలు గల చిన్నారులకు ఐఈఆర్‌టీలు మద్దిలేటి ప్రత్యేక పరికరాలతో విద్యను బోధించారు. దివ్యాంగుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఇరువర్గాల మధ్య భూవివాదం



ఇరువర్గాల వారికి నచ్చజెబుతున్న పోలీసులు, అధికారులు

కర్నూలు(రూరల్): మండల పరిధిలోని ఉల్చాలలో గ్రామకంఠం భూమిగా ఉన్న కుక్కల కుంటను హిందూ శ్మశాన వాటికకు కేటాయించాలని ఒక వర్గం, కుంటను పూడ్చి పార్కును ఏర్పాటు చేయాలని మరో వర్గం డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం సాయంత్రం ఇరు వర్గాల మధ్య వాగ్వాదం ఏర్పడింది. ఘర్షణ వాతావరణం నెలకొనడంతో పంచాయతీ అధికారులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. కర్నూలు తాలుకా అర్బన్ ఎస్‌ఐలు, రూరల్ తహసీల్దార్ టి.వి.రమేష్‌బాబు, ఎంపీడీఓ రఘునాథ్ గ్రామానికి చేరుకొని వారిని సమాధానపరిచారు. ఇరువర్గాల వాదనలు విని సమస్యను పరిష్కరించే వరకు సంయమనం పాటించాలని, గ్రామంలో ఘర్షణలకు దిగవద్దని సూచించారు.

గ్రామాభివృద్ధిని అడ్డుకుంటున్నారు.

గ్రామకంఠం భూమిగా ఉన్న కుక్కలకుంట జి.సిగవరం గ్రామానికి రోడ్డు పక్కనే ఉండటం వల్ల తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. గతంలో ఈ కుంటలో ప్రమాదవశాత్తు పడి ఇద్దరు మరణించారు. చెత్తాచెదారం, జంతువులు మరణిస్తే కళేబరాలను తీసుకొచ్చి కుంటలో వేస్తుండటంపై ఒక వర్గం వారు గ్రామ పంచాయతీ దృష్టికి తీసుకొచ్చారు. గ్రామ సర్పంచ్‌గా సమస్య పరిష్కరించేందుకు కుంటను పూడ్చి పార్కును ఏర్పాటు చేయాలని పంచాయతీ తీర్మానం చేశాం. సోమవారం కుంటను పూడ్చుతుండగా ఓ వర్గం వారు అడ్డుకుని వివాదం సృష్టించారు. కూటమి నాయకులు రెండు వర్గాల వారిని రెచ్చగొట్టి ప్రశాంతంగా ఉన్న గ్రామంలో చిచ్చు పెడుతున్నారు. గ్రామాభివృద్ధికి అడ్డంకులు సృష్టిస్తున్నారు.

వల విసిరితే చేపలు చిక్కాల్సిందే!



గోరుకల్లు జలాశయంలో చేపల వేటకు వెళ్తున్న మహిళ (ఇన్‌సెట్) వలను అల్లుతున్న కార్మికుడు

పురుషులతో సమానంగా మహిళా జాలర్లు సైతం చేపల వేటకు సై అంటున్నారు. మండల పరిధిలోని గోరుకల్లు జలాశయంలో పలువురు మహిళలు చేపల వేటకు వెళ్తున్నారు. అనకాపల్లికి చెందిన మత్స్యకారులు ఉపాధి కోసం గోరుకల్లు జలాశయంలో చేపలు పట్టేందుకు వచ్చారు. ఇంజిన్ బోటులో జలాశయంలోకి వెళ్లి నీటిలో వలలు వేసి ఉంచుతారు. మరుసటి రోజు వెళ్లి చేపలను తీసుకొస్తారు. పురుషులకు ఏమాత్రం తీసిపోకుండా మహిళలు చేపల వేటలో రాణిస్తుండటం విశేషం. తమ పూర్వీకుల నుంచి ఈ వృత్తిని కొనసాగిస్తున్నట్లు వారు తెలిపారు. – పాణ్యం

పీజీఆర్ఎస్‌కు నాలుగు దరఖాస్తులు

సి.బెళగల్: ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమానికి నాలుగు దరఖాస్తులు వచ్చినట్లు ఇన్‌చార్జ్ తహసీల్దార్ పురుషోత్తం తెలిపారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఇన్‌చార్జ్ తహసీల్దార్ ఆధ్వర్యంలో, మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ రాణెమ్మ ఆధ్వర్యంలో పీజీఆర్ఎస్ కార్యక్రమం నిర్వహించారు. వచ్చిన నాలుగు దరఖాస్తులు కూడా రెవెన్యూ సంబంధ భూ సమస్యల అర్జీలేనని ఇన్‌చార్జ్ తహసీల్దార్ తెలిపారు. అయితే కార్యక్రమానికి కొందరు మండల అధికారులు రెగ్యులర్‌గా హాజరు కాకపోవడం, ప్రజలు ఇచ్చిన అర్జీలను పరిష్కరించడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండటంపై ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. సోమవారం వైద్య, ఇరిగేషన్, పీఆర్, విద్యుత్ ఏఈలు, ఆర్‌అండ్‌బీ శాఖల అధికారులు కార్యక్రమానికి గైర్హాజరయ్యారు. ఈఓఆర్డీ ఈశ్వరయ్య స్వామి, ఏఓ మల్లేష్‌కుమార్, ఎంఈఓ జ్యోతి, ఆర్‌డబ్ల్యూఎస్, ఏఈలు గోనేనాయక్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుజాత, ఏపీఓ రామన్న తదితర అధికారులు పాల్గొన్నారు.

నేడు రెండు గ్రామాల్లో 'పొలం పిలుస్తోంది'

సి.బెళగల్: మండల పరిధిలోని రెండు గ్రామాల్లో మంగళవారం ×పొలం పిలుస్తోంది× కార్యక్రమం నిర్వహించనున్నట్లు మండల వ్యవసాయ అధికారి (ఏఓ) మల్లేష్‌కుమార్ తెలిపారు. ఆయన సోమవారం ఓ ప్రకటనలో తెలుపుతూ.. మంగళవారం ఉదయం మండలంలోని సి.బెళగల్ – 1, మధ్యాహ్నం కంబదహాల్ గ్రామ సచివాలయంలో కార్యక్రమం ఏర్పాటు చేయనున్నట్లు లెలిపారు. అదేవిధంగా మధ్యాహ్నం క్షేత్ర ప్రదర్శలో భాగంగా రైతులతో కలిసి పంట పొలాల సందర్శించి రైతులకు సస్యరక్షణ పద్ధతులపై సూచనలు చేస్తామన్నారు. ఆయా గ్రామాల రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

సుందరయ్య పార్కును అభివృద్ధి చేయాలి

కల్లూరు: కల్లూరు అర్బన్ 37వ వార్డులో ఉన్న పుచ్చలపల్లి సుందరయ్య పార్కును అభివృద్ధి చేయాలని సీపీఎం నగర కార్యదర్శి టి.రాముడు సోమవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. నగరంలో అనేకచోట్ల స్థలాలు ఉన్నప్పటికీ సుందరయ్య పార్కులో ఫిల్టర్ బెడ్‌కు శంకుస్థాపన చేయడం తగదన్నారు. ఈ నిర్ణయాన్ని ఉపసంహరించుకొని వేరే ప్రాంతంలో ఫిల్టర్ బెడ్ నిర్మించేలా చర్యలు తీసుకోవాలని కమిషనర్, జిల్లా కలెక్టర్‌ను కోరారు.

ఉపాధి పనులు కల్పించాలి



మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు కేవీ.నారాయణ

కోడుమూరు రూరల్: నగర పంచాయతీ పేరుతో గూడూరు ప్రజలకు ఉపాధి హామీ పనులను దూరం చేయడం తగదని, కూలీలందరికీ ఉపాధి పనులు కల్పించాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు కేవీ.నారాయణ డిమాండ్ చేశారు. సోమవారం గూడూరులో వ్యవసాయ కార్మికులతో సీపీఎం నాయకులు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నగర పంచాయతీ పేరుతో గూడూరు ప్రజలకు ఉపాధి పనులను దూరం చేయడం వల్ల వ్యవసాయ కూలీలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, చాలా మంది కూలీలు ఇతర ప్రాంతాలకు వలస వెళుతున్నారని వాపోయారు. గూడూరులో కనీసం ఒక పరిశ్రమ కూడా లేదని, ఎలాంటి సౌకర్యాలు లేవన్నారు. ఇక్కడి ప్రజలు పొట్ట చేతబట్టుకొని ఇతర ప్రాంతాలకు వలస వెళ్లాల్సిన దుస్థితి దాపురించిందని వాపోయారు. ప్రభుత్వం స్పందించి గూడూరు వాసులకు ఉపాధి పనులను కల్పించాలని కోరారు. స్థానిక సీపీఎం నాయకులు మోహన్, రాజశేఖర్, రంగన్న, దానమన్న తదితరులు పాల్గొన్నారు.

భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు



భోగేశ్వరాలయ ఏర్పాట్లను పరిశీలిస్తున్న దృశ్యం

గడివేముల: మహాశివరాత్రి సందర్భంగా భోగేశ్వరాలయానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని సదుపాయాలు కల్పిస్తున్నట్లు తహసీల్దార్ వెంకటరమణ, పాణ్యం సీఐ కిరణ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. సోమవారం గడిగరేవుల గ్రామ సమీపంలో వెలసిన శ్రీదుర్గా భోగేశ్వరాలయాన్ని వారు సందర్శించారు. పార్కింగ్ స్థలాన్ని పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. భక్తుల వాహనాలను ఆలయానికి కొద్ది దూరంలో పార్కింగ్ చేసేలా ఏర్పాటు చేసినట్లు చెప్పారు. జాగరణ సందర్భంగా భక్తులు అధికంగా తరలిరానున్న నేపథ్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని ఈఓ రామానుజన్, సేవాకమిటీకి సూచించారు. ఆలయ ప్రాంగణమంతా లైటింగ్ ఏర్పాటు చేయాలన్నారు. సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి పర్యవేక్షణ చేస్తుంటామని, ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం మండలస్థాయి అధికారులతో స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. స్వామివారిని దర్శించుకుని పూజలు చేశారు. ఎంపీడీఓ వాసుదేవగుప్తా, ఏఈలు పవన్, ఈఓపీఆర్డీ మహీధర్‌రెడ్డి, ఎస్‌ఐ నాగార్జునరెడ్డి, .ఆలయ ప్రధానార్చకులు శ్యాం సుందర్‌శర్మ, ఆలయ సిబ్బంది రమణ, తదితరులు ఉన్నారు.

• ప్రమాదకరంగా గొయ్యి



ఏపీఈఆర్‌సీ కార్యాలయం వద్ద ప్రమాదకరంగా గొయ్యి

స్థానిక దిన్నెదేవరపాడు గ్రామానికి వెళ్లే ఆర్‌అండ్‌బీ రహదారిలో ఏపీఈఆర్‌సీ భవనం ఎదురుగా ప్రమాదకరంగా గొయ్యి ఉంది. గత 15 రోజుల కిందట ప్రైవేటు సెల్‌ఫోన్ కంపెనీవారు ఈ గొయ్యి తవ్వి తమ పని పూర్తి చేసుకుని తర్వాత అలాగే వదిలేశారని స్థానికులు చెబుతున్నారు. ఈ రహదారిలో నిత్యం వాహనాల రద్దీ ఉంటుంది. ఏపీఈఆర్‌సీ భవనం ఉన్నందున ప్రతి నిత్యం వాహనాలు, జిల్లా ఉన్నతాధికారులు రాకపోకలు సాగిస్తుంటారు. అలాగే జిల్లా పోలీస్ శిక్షణ కేంద్రానికి వెళ్లే రహదారి కావడంతో అధికారులు ఈ మార్గంలోనే వెళ్తుంటారు. రోడ్డును ఆనుకొని గొయ్యి ఉండటంతో కొత్త వ్యక్తులు ప్రమాదం బారినపడే అవకాశం ఉందని వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి గొయ్యిని పూడ్చివేయాలని స్థానికులు కోరుతున్నారు. – కర్నూలు(రూరల్)

హైవేపై బ్లాక్ స్పాట్ల గుర్తింపు



సుగాలిమెట్ట వద్ద పీడీ ఆశోక్‌రెడ్డికి వినతి పత్రం అందిస్తున్న ప్రజలు



బలపనూరు మెట్ట వద్ద సర్వీస్ రోడ్డును పరిశీలిస్తున్న ఎస్‌డీపీఓ జావళి

పాణ్యం: జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదాలు నివారించేందుకు పోలీసు శాఖ, ఎన్‌హెచ్ సిబ్బందితో కలిసి బ్లాక్ స్పాట్‌లను గుర్తించారు. సోమవారం నంద్యాల ఎస్‌డీపీఓ జావళి, ఎన్‌హెచ్‌పీడీ ఆశోక్‌కుమార్ రెడ్డి, ఎన్‌హెచ్ రూట్ ఇన్‌స్పెక్టర్ నరేష్‌రెడ్డి ఆధ్వర్యంలో బ్లాక్ స్పాట్‌లను గుర్తించారు. తమ్మరాజుపల్లె నుంచి శాంతిరామ్ ఆసుపత్రి వరకు హైవేలో పర్యటించారు. తమ్మరాజుపల్లె కేఎంసీ కంపెనీ సమీపంలో, గ్రామం వద్ద ఉన్న యూటర్న్‌లో గతంలో ప్రజలు రోడ్డు దాటే క్రమంలో ప్రమాదాలకు గురై మృతి చెందినట్లు గుర్తించారు. ఇక్కడ రోడ్డు దాటేందుకు వీలుగా వంతెనను నిర్మించాలని గ్రామస్తులు కోరారు. అలాగే ప్రమాదాలకు అడ్డాగా పిలిచే అడ్డవాగుపై చెప్పలేనన్ని ప్రమాదాలు చోటు చేసుకున్నాయి. బ్రిడ్జి ఇరుకుగా ఉండటమే ప్రమాదాలకు కారణమని గుర్తించారు. బ్రిడ్జిని వెడల్పు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. అలాగే ఎస్ టర్నింగ్ వద్ద వాహనాల వేగం తగ్గేలా, మలుపు, యూటర్న్ ఉందని సూచించే బోర్డులు ఏర్పాటు చేయనున్నారు.

- సుగాలిమెట్ట వద్ద ఏపీ మోడల్ స్కూల్, కస్తుర్బా గాంధీ పాఠశాల, పిన్నాపురం గ్రామానికి వెళ్లేందుకు రాంగ్ రూట్‌లో వెళ్తున్న తీరును గుర్తించారు. అయితే నిత్యం వేల మంది విద్యార్థులు రోడ్డు దాటాల్సి ఉంటుంది. ఈ క్రమంలో అనేక ప్రమాదాలు జరిగాయి. ఇటీవల యూటర్న్ వద్ద జరిగిన ప్రమాదంలో ఒకరు మృతి చెందారు. అంతేకాక పిన్నాపురం గ్రామానికి వెళ్లే వారు యూటర్న్ నుంచి రాంగ్ రూట్‌లో వెళ్లా ఉంటుందని రెండు గ్రామాల ప్రజలు తెలిపారు. ఈ యూటర్న్ వద్ద విద్యార్థులు వెళ్లేందుకు, వీలుండేలా వంతెనతో పాటు, పిన్నాపురానికి వెళ్లేందుకు సర్వీస్ రోడ్డు నిర్మించాలని సుగాలిమెట్ట ప్రజలు, పిన్నాపురం సర్పంచ్ ఎల్లక్రిష్ణయ్యలు ఎన్‌హెచ్ పీడీకి వినతి అందించారు.
- పాణ్యం డొంగు వద్ద కూడా ఇదే పరిస్థితి నెలకొంది. ప్రజలు రోడ్డు దాటేందుకు వీలుండేలా వంతెన నిర్మించాలని గుర్తించారు.
- బలపనూరు మెట్ట వద్ద ఈ నెల 14వ తేదీన యూటర్న్ వద్ద రోడ్డు ప్రమాదంలో ఓ విద్యార్థి మృతి చెందగా మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. అంతేకాక కొలూరు, వెంకటేశ్వరాపురం గ్రామాల నుంచి ప్రభుత్వ ఉన్నత పాఠశాల వద్ద వందల సంఖ్యలో విద్యార్థులు రోడ్డు దాటుతుంటారు. నిత్యం రద్దీగా ఉండే ఈ రోడ్డుపై వాహనాలు వేగంతో వెళ్తుంటాయి. రోడ్డు ప్రమాదాలు నివారించేందుకు చర్యలు తీసుకోవాలని ప్రజలు పెద్దఎత్తున వినతులు అందించారు. విద్యార్థులు, వాహనాల రాకపోకలకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకుంటామని పీడీ తెలిపారు. సర్వీస్ రోడ్డును ఎస్‌డీపీఓ జావళితో పాటు, పీడీ ఆశోక్‌రెడ్డి సిబ్బంది పరిశీలించారు. పోలీసులు, ఎన్‌హెచ్ సిబ్బంది పాల్గొన్నారు.